# సింగూరు భూసేకరణపై సుప్రీంకోర్టు తీర్పు

# వాస్తవంగా రైతుల విజయమేనా?

**2006లో** సిపిఐ(ఎం) నాయకత్వంలోని పశ్చిమబెంగాల్ రాష్ట్రప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనలపేరిట హుగ్లీ జిల్లాలోని సింగూరు ప్రాంతంలో 1300 మంది రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాల సారవంతమైన భూములను సేకరించింది. ఈ భూములను నానో కార్ల ఫ్యాక్టరీ పెట్టటానికి టాటా మోటార్స్ లిమిటెడ్ కంపెనీకి లీజుకిచ్చింది.

ఈ భూసేకరణకు గురైన రైతులంతా, ప్రభుత్వ భూసేకరణను ప్రతిఘటించి, తమ భూములను తాము తిరిగి దక్కించుకోవడానికి తీవ్రంగా పోరాడారు. మరోవైపున సిపిఐ(ఎం) ఆధ్వర్యంలోని నాటి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున పోలీసు బలగాలను ప్రయోగించి అణచివేతతో ఈ భూమిని సేకరించింది. తమ భూములను తిరిగి దక్కించుకోవటానికి ఆందోళనచేస్తున్న రైతుల ఎడల సిపిఐ(ఎం)కు చెందిన సాయుధ కార్యకర్తలు సైతం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు.

సింగూరు రైతుల ఈ ప్రతిఘటనోద్యమం అధికార సిపిఐ(ఎం)కు, ప్రతిపక్షంలోనున్న తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య రాజకీయ పెనుగులాటగా మారి, ఎన్నికల క్రమంలో ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాధికారంలోకి రావడానికి తోడ్పడింది.

ఓవైపున సింగూరు రైతుల ఆందోళన, భూసేకరణ వ్యతిరేక ప్రతిఘటనకు ఓ చిహ్నంగా మారగా, మరోవైపున మమతాబెనర్జీ రాష్ట్రంలో పాలనాధికారంలోకి రావటానికి దీనిని ఓ సాధనంగా చేసుకోవటంతోపాటు, తనను తాను సింగూరు రైతుల సమస్యలపై పోరాడిన యోధురాలిగా ప్రచారం గావించుకుంది. సింగూరు రైతుల ఆందోళన సిపిఐ(ఎం) పార్టీని పూర్తిగా ప్రజలకు దూరంచేసి, వేర్లతోసహా దాని పార్లమెంటరీ మూలాలను కెళ్ళగించి భవిష్యత్తులో ప్రభుత్వాధికారంలోకి తిరిగి రాగలమనే ఆశలను వమ్ముచేసింది.

అయితే, సింగూరు రైతుల ప్రతిఘటన లేవనెత్తుతున్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. వ్యవసాయాధారితమైన మనదేశంలో రైతాంగ జీవనాధారమైన భూములను ప్రభుత్వాలు 'ప్రజా ప్రయోజనం' లేదా 'ప్రజోపయోగం' పేరున–అది కూడా వ్యక్తుల ప్రైవేటు ఆస్తిహక్కును పవిత్రమైందిగా భావించే రాజ్యాంగం, చట్టం ఆ హక్కును పరిరక్షిస్తాయని చెప్పబడుతున్న ఈ వ్యవస్థలో–ఏ విధంగా సేకరిస్తాయనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఈ రకమైన మౌలిక స్వభావం కల్గిన, విధాన పరమైన ప్రశ్నలకు మన ఉన్నత న్యాయస్థానాలు (హైకోర్టులు లేదా సుప్రీంకోర్టు) సమాధానమీయవు. ఈ విధమైన వివాదాలు ఎక్కడైనా ఉత్పన్నమైతే, ఆ కేసులలోని చట్టపరమైన 'అనుకూలతల' ప్రకారం ఉనికిలోవున్న చట్టం మరియు అంతకుముందున్న ప్రమాణాల ఆధారంగా ఆ వివాదాలను పరిష్కరించ బూనుకుంటాయి.

కలకత్తా హైకోర్టు డివిజన్‌బెంచ్ సింగూరు భూ సేకరణను సమర్ధించింది. "ఉద్యోగ ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు, ఆ ప్రాంత సామాజిక – ఆర్థిక అభివృద్ధి అనే ప్రజోపయోగంకొరకు మాత్రమే ఆ భూముల సేకరణ జరిగింది మినహా మరే ప్రైవేటు కంపెనీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఉద్దేశించింది కాదని" డివిజన్ బెంచ్ ఆనాటి తన తీర్పులో ప్రకటించింది.

సేకరించిన భూమిలో టాటాకంపెనీ కొన్ని నిర్మాణాలను చేపట్టినప్పటికీ, భూసేకరణకు వ్యతిరేకంగా తీవ్ర ప్రతిఘటన ముందుకొచ్చిన కారణంగా, ఆ కంపెనీ అక్కడ నిర్మించతలపెట్టిన నానో ప్రాజెక్టును గుజరాత్ రాష్ట్రంలోని సనంద్‌కు తరలించింది. అక్కడ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆ కంపెనీ మరిన్ని సౌకర్యాల్ని పొందగలిగింది.

కాగా, కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, 8 సం॥ల తర్వాత అనగా, 2016 ఆగస్టు 31న సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు వెలువడిన తర్వాత 12 వారాలలో సింగూరులో రైతులనుండి సేకరించిన భూములను వారికి తిరిగి అప్పగించాలని సుప్రీంకోర్టు తన తీర్పులో ఆదేశించింది. సుప్రీంకోర్టు బెంచ్‌లోనున్న ఇరువురు న్యాయమూర్తుల మధ్య కేసులోని కొన్ని అంశాలపై విభేదాలున్నప్పటికీ, విడివిడి తీర్పులిచ్చినప్పటికీ, ఆ భూముల సేకరణ ప్రక్రియలో పొరపాట్లున్నాయన్న ఏకాభిప్రాయంతో, దీనినంతా చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించారు.

సింగూరు రైతులలో ఈ తీర్పు సంతోషాతిరేకాలను నింపింది. ప్రత్యేకించి, సింగూరు రైతుల సమస్యలపై పోరాడిన యోధురాలిగా ప్రచారంగావించుకొన్న మమతా బెనర్జీకి ఈ తీర్పు చాలా సంతోషాన్ని కలుగజేసింది.

ప్రస్తుత అసమాన, దోపిడీవ్యవస్థ పక్షాన నిలిచే 'మేధావులు', 'నిపుణులు' కొందరు బయలుదేరి ఈ తీర్పును రైతాంగ విజయంగా అభివర్ణించారు. అంతేగాక, ఈ తీర్పు భవిష్యత్తులో రాష్ట్రప్రభుత్వాల భూసేకరణపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని వారు పేర్కొన్నారు.

సిపిఐ(ఎం) పార్టీ మొఖం వేళ్ళాడేసుకున్నప్పటికీ పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, తద్వారా ఉద్యోగావకాశాలను

పెంచేందుకు ఆనాటికి ఉనికిలో వున్న '1894 భూసేకరణ చట్టం' ప్రకారం సింగూరు భూములను సేకరించామని, ఇది పార్టీయొక్క రాజకీయ తప్పిదంగా రుజువైందని పేర్కొంటూనే తన చర్యను సమర్థించుకుంది.

వాస్తవానికి పారిశ్రామిక, వ్యాపార రంగాలకు భూములను సులభతరంగా అందించేవిధంగా, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల కనుగుణంగా '1894 నాటి భూసేకరణ చట్టాన్ని' ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ వస్తున్నారు. కేంద్రప్రభుత్వమూ మరియు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు వారి వారి అవసరాలకనుగుణంగా భూసేకరణ చట్టాన్నీ సవరించారు. ఆంధ్రప్రదేశ్‌లో భూసమీకరణ చట్టంలాగా ప్రత్యేక చట్టాలను సైతం చేశారు.

సింగూరులో రైతుల ప్రతిఘటన తర్వాత కూడా, వివిధ రాష్ట్రాలలో ఆయా ప్రభుత్వాలు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి, రైతుల భూములను బలవంతంగా సమీకరించాయి. 'ప్రజాభిప్రాయ సేకరణ' వంటి బూటకపు తంతులను సైతం జరగనీయకుండా పోలీసు బలగాలు మోహరించి రైతులను భయభ్రాంతుల్ని చేస్తూ వచ్చినప్పటికీ, తమ భూములను బలవంతంగా గుంజివేసుకోవటానికి వ్యతిరేకంగా రైతాంగం నిరంతరాయ ఆందోళనలు సాగిస్తూ వస్తున్నారు.

ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో, రాజధాని నిర్మాణం పేరున, పారిశ్రామిక అభివృద్ధిపేరున వేలాది ఎకరాల రైతాంగ భూములను రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా గుంజివేసుకుంది. భూములు ఇవ్వటానికి నిరాకరించిన రైతులను పోలీసులూ, ప్రభుత్వమూ అధికారంలోనున్న పాలక రాజకీయ పార్టీ కార్యకర్తలూ బెదిరింపులకు గురిచేసి భూములను 'సమీకరించారు'. వేలాదిమంది పేద రైతాంగాన్ని, భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలను ఒక పద్ధతి ప్రకారం వారి జీవనాధారాన్ని కోల్పోయేట్లుచేసి, మరో జీవనోపాధి చూపకుండా, ఎలాంటి నష్టపరిహారమూ చెల్లించకుండా ఎవరైనా ఈ అన్యాయాన్ని ఎత్తిచూపి ప్రశ్నిస్తే వారిపై 'ప్రభుత్వ వ్యతిరేక' లేక 'అభివృద్ధి వ్యతిరేక' ముద్రలు వేసి వారిని వేధింపులకు గురిచేస్తున్నారు.

తాజా ప్రభుత్వ అధ్యయనం ప్రకారమే, గత సంవత్సర కాలంలో దేశం మొత్తంమీద ఆందోళనల్లోకి వస్తున్న రైతాంగం సంఖ్య 300 శాతం పెరిగిందని తెలుస్తోంది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలైన 'పారిశ్రామికాభివృద్ధి' 'భూసేకరణ'ల రధచక్రాలలో నలిగిపోతున్న రైతాంగంయొక్క తీవ్ర నిస్సహాయ దుస్థితికి ఈ పరిస్థితి అద్దం పడుతోంది.

అయితే, 'పారిశ్రామికాభివృద్ధి మరియు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన' పేరిట ధ్వంసం చేయబడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ఈ న్యాయస్థానాలేవీ ముందుకు రాలేదు. పైగా, ఇందుకు భిన్నంగా దరఖాస్తుదారుల 'లోకోస్టాండీ' (గుర్తింపు హోదా) స్థితిని లేవనెత్తి, 'ప్రపంచస్థాయి రాష్ట్ర రాజధాని' నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా గుంజుకున్న సారవంతమైన భూములకు చెందిన రైతాంగం తరపున దాఖలు చేసిన దరఖాస్తులను కనీసం వినను కూడా వినకుండానే సుప్రీంకోర్టు బెంచ్ తిరస్కరించింది. భూ సేకరణలపై ఉన్నత న్యాయస్థానాల తీర్పుల స్వభావమేలా వుందనే దానికి ఇదో ఉదాహరణ.

గాంధీ జయంతి మరియు లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతికి ఒక్కరోజు ముందుగా 2016 అక్టోబర్ 1న జార్ఖండ్ రాష్ట్రం, హజారీబాగ్ పట్టణానికి 30 కి॥మీ దూరంలోని బర్కాగావ్‌లోని దోదికలా వద్ద చోటుచేసుకున్న సంఘటన, రాష్ట్రాల బలవంతపు భూసేకరణ బాధితులైన రైతులకు ఎంతటి అన్యాయం జరుగుతుందనే దానికి తాజా ఉదాహరణ.

2006లో ఆ ప్రాంతంలోని 28 గ్రామాలలో బొగ్గుగనుల తవ్వకాల కోసం 8 వేల ఎకరాల భూములను సేకరించేందుకు ఎన్‌టిపిసి పూనుకుంది. ఆసియా ఖండంలో పెద్దదైన ఓ బొగ్గుగనుల ప్రాజెక్టు కోసం చేపట్టిన ఈ భూసేకరణ ప్రక్రియలో, ఆదివాసుల హక్కుల చట్టం – 2006 ప్రకారం గ్రామసభల ఆమోదం తీసుకోకుండానే, చిన్న రైతాంగం నుండి ఎన్‌టిపిసి భూములను సేకరించింది. ఎన్‌టిపిసి సేకరించిన ఈ భూములు జార్ఖండ్ రాష్ట్రంలోనే అత్యంత సారవంతమైనవి. కానీ ఎన్‌టిపిసి, ఆ భూములను కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకు నాలుగురెట్లు చెల్లించబడుతుందనే చట్టపరమైన ఆదేశాలకు భిన్నంగా నామమాత్రమైన పరిహారాన్ని మాత్రమే చెల్లించింది.

భూసేకరణ, పునరావాస చట్టం – 2013 ప్రకారం చట్టం నిర్దేశించిన పరిహారాన్ని డిమాండ్ చేస్తూ బాధిత రైతాంగం – పాక్రీ బర్వాధ్‌కోల్ మైనింగ్ ప్రాజెక్టు కోసం ఎన్‌టిపిసి చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 1న ఓ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాపిడ్ యాక్షన్‌ఫోర్స్‌కు చెందిన సాయుధ పోలీసులు వారిపై లాఠీఛార్జీకి పాల్పడి, ఆపై కాల్పులు సాగించి ఆందోళనకారులు కూడా కాని దోవనపోయే నలుగురిని బలిగొన్నారు. ఆ ప్రాంతాన్నంతా పోలీసు దిగ్బంధంలో వుంచారు. భూసేకరణ బాధిత రైతాంగానికి రాజ్యం కల్పిస్తున్న న్యాయం ఈ విధంగా వుంది! సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఏ తీర్పులూ బాధిత రైతాంగాన్ని ఆదుకునేందుకు తోడ్పడలేదు. బలవంతంగా భూములను సేకరిస్తున్న ప్రభుత్వం రైతుల ఎడల అనుసరిస్తున్న వాస్తవచిత్రం ఈ విధంగా వుంది.

ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పు కూడా – 'ప్రజా ప్రయోజనం' లేక 'అభివృద్ధి' పేరిటగానీ భూ యజమాని యొక్క ఆమోదం లేకుండాగానీ ప్రభుత్వాలు రైతుల భూములను సేకరించటాన్ని ఆమోదించరాదనే విధానం లేదా సూత్రంపై ఆధారపడి ఇచ్చింది కాదు. కేవలం నిర్దేశిత ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియను అమలు చేసిన పాలనా అధికార యంత్రాంగం, సంబంధిత చట్టాన్ని సక్రమంగా వర్తింపజేయకపోవటం కారణంగా మాత్రమే ఈ తీర్పునిచ్చినట్లు పేర్కొంది. అంటే, సంబంధిత చట్టాన్ని పాలనా యంత్రాంగం

సక్రమంగా అనువర్తింపజేసినట్లయితే, రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణకు ఎలాంటి అభ్యంతరంలేదని చెప్పటమే కదా!? న్యాయమూర్తులు కూడా కేవలం 'రైతుల హక్కుల ఉల్లంఘనల' సమస్యలను, 'ప్రజా ప్రయోజన' సమస్యలను మేథో జిజ్ఞాసపరమైన దృష్టితో చర్చించి, తర్కించి, వారి విడివిడి తీర్పులలో పేర్కొన్నారు. కానీ, సాంకేతికంగా చట్టపరమైన పద్ధతుల అమలులో, ప్రక్రియాపరంగా అనువర్తింపజేయటంలో జరిగిన తప్పిదాల విషయంలో ఏకాభిప్రాయంతో వున్నారు. రైతుల నుండి భూములను సేకరించి, వారిని వారి జీవనాధారాల నుండి దూరం చేయటానికి సంబంధించిన చట్టంలోని అంశాలను వారు ప్రశ్నించటంగానీ లేదా దానిపై చర్యలు తీసుకోవటంగానీ చేయలేదు. ప్రభుత్వాలు చేపడుతున్న భూసేకరణ విధానాన్ని ఈ తీర్పు రద్దు చేయలేదు.

కనుక 'భూసేకరణ చట్టం – 2013' ప్రకారం ప్రభుత్వాలు బలవంతంగా సేకరిస్తున్న భూములకు చెందిన రైతాంగాన్నికానీ, లేక కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గొప్పగా కీర్తిస్తున్న ఇదే తరహాలోని ఆంధ్రప్రదేశ్ భూసమీకరణ చట్టంయొక్క బాధితులైన రైతాంగాన్నికానీ – సింగూరు రైతుల భూసేకరణ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉద్ధరించబోతున్నదని ఎవరూ భ్రమ పడాల్సిన అవసరంలేదు.

కనుక, విశాల అర్ధంలో టాటావారి నానో ప్రాజెక్టు కోసం లీజుకిచ్చిన భూములను తిరిగి బాధిత రైతులకు అందజేయటాన్ని సుగమంచేసిన సింగూరు భూసేకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రైతాంగ విజయంగా పేర్కొనలేం. ఇది ఒక పరిమిత ప్రయోజనాన్ని కల్గించే పరిణామం మాత్రమే! నానో ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన విస్తృత నిర్మాణ పనులను ప్రారంభించి, వదిలేసిన ఆ భూములను తిరిగి వ్యవసాయయోగ్యంగా మలుచుకొనేందుకు బాధిత రైతాంగం మరింతగా శ్రమించాల్సి వస్తుంది.

దేశవ్యాపితంగానున్న రైతాంగం తమ భూముల పరిరక్షణకోసం పోరాట స్ఫూర్తితో ఐక్యంగా నిలవటం ద్వారానే, తమ భూములను తాము కాపాడుకో గలుగుతారు.

ooooo